తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
ఆదివారం
13 సెప్టెంబర్ 2026
పేజీలు - 12

# చేయూత అప్లికేషన్ల జాతర

- జిల్లాలో మొత్తం చేయూత అప్లికేషన్లు 4239...
- వెరిఫికేషన్ ముగియడం తోనే కొత్త చేయూత...
- పింఛన్లు 25 లోపు వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి....
- అధికారులను ఆదేశించిన ప్రభుత్వం....

**ములుగు బ్యూరో,సెప్టెంబర్12(జనం సాక్షి):** ములుగు జిల్లా వ్యాప్తంగా చేయూత పింఛన్ల ఆన్లైన్ ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికే ప్రభుత్వం చేయూత పింఛన్లు ఆన్లైన్ చేసుకోవడం కోసం గడువు కూడా పెంచడం జరిగింది.చేయూత కొత్త పింఛన్ల మంజూరుకు క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించడం జరిగింది.



వార్త మెయిన్ 7లో

# రామప్పను సందర్శించిన గ్రూప్ 2 శిక్షణ అధికారులు

**వెంకటాపూర్ (రామప్ప), సెప్టెంబర్ 12(జనం సాక్షి):** వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయాన్ని హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న గ్రూప్ 2 అధికారులు భారత్ దర్శన్ లో భాగంగా శనివారం సందర్శించారు.



వార్త మెయిన్ 7లో



# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కనకదుర్గ కాలనీ, వడ్డేపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సుధానగర్ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, ఎస్ఐఆర్ ప్రక్రియలో మ్యాపింగ్ కానీ అనామాలు ఇస్ జాబితాలో ఉన్న ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన విచారణ కేంద్రాలను, కొత్తగా ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణకు చేపట్టిన స్పెషల్ క్యాంపెన్ ను జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రక్రియ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు సంబంధించిన నోటీసులను ఎలాంటి జాప్యం లేకుండా సత్వరమే అందించాలని బీఎల్ఓలకు సూచించారు. సెలవు రోజుల్లో ఉద్యోగులు, వ్యాపారులు సాధారణంగా తమ ఇళ్ల వద్ద అందుబాటులో ఉండే అవకాశం ఉన్నందున, బీఎల్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లు ధ్రువీకరణ పత్రాలు సమర్పించేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. చిన్నచిన్న లోపాలు లేదా వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో సంబంధిత ధ్రువీకరణ పత్రాలను యాప్‌లో మిగతా 11లో..

# సరస్వతి కాలువకు నీటి విడుదల



**నిర్మల్ బ్యూరో , సెప్టెంబరు 12:( జనంసాక్షి ) :** వర్షాభావంతో పంటలు ఎండిపోయే పరిస్థితిని ఎదుర్కొంటున్న నిర్మల్ నియోజకవర్గ రైతులకు ఊరట లభించింది. సోన్, లక్ష్మణచాందా, మామడ మండలాల రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరస్వతి కాలువకు ఆదివారం ఉదయం నీటిని విడుదల చేయనున్నట్లు నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి తెలిపారు.

శనివారం నిర్మల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడు మండలాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయని, వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో రైతులు, ప్రజాప్రతినిధులు నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరిరావును కలిసి సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు.

రైతుల సమస్యపై శ్రీహరిరావు ప్రత్యేక చొరవ తీసుకుని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారని, అనంతరం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారని భీమ్‌రెడ్డి పేర్కొన్నారు. స్పందించిన మంత్రి అధికారులతో చర్చించి ఆదివారం ఉదయం సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

నీటి విడుదలతో మూడు మండలాల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, శ్రీహరిరావు చొరవతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం కావడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని భీమ్‌రెడ్డి అన్నారు. వారాబందీ పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నందున రైతులు సమన్వయంతో నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఆత్మ చైర్మన్ కొండ్రు రామ్‌రెడ్డి, గండి రామన్న, దత్తసాయి ఆలయ చైర్మన్ కొట్టె శేఖర్, లక్ష్మణచాందా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, మామడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్, బాపయ్య, ప్రతాప్‌రెడ్డి, గంగారెడ్డి కలగిరి తదితరులు పాల్గొన్నారు.



# జీఎం కార్యాయంలో విత్తన మట్టి గణపతుల పంపిణీ

**శ్రీరాంపూర్(జనంసాక్షి):**వినాయక చవితి సందర్భంగా ఏరియా సింగరేణి జీఎం కార్యాయంలో శనివారం మట్టిగణపతి విగ్రహాలను ఉద్యోగులకు పంపిణీ చేశారు.ఈ సందర్బంగా ఏరియా జిఎం శ్రీనివాస్ మాట్లాడుతూ నీటి కాలుష్యం నివారణలో భాగంగా మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.ప్రతీ గణపతి విగ్రహంలో ఒక విత్తనం ఉందని వినాయక చవితి తర్వాత మీ ఇంటి ప్రాంగణంలోనే నీటితో తడిపితే అవి మొక్కలుగా తయారవుతాయి అన్నారు. ఒక్కో గణపతి మీ ఇంట్లో ఒక చెట్టులాగా ఎదగాలని ఆకాంక్షించారు.సింగరేణి సంస్థ ద్వారా అన్ని ఏరియాలలో వేలాది రూపాయల ఖర్చుతో పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా వేలాది మట్టి గణపతుల వితరణ చేపడుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా,డీజీఎం అనిల్ కుమార్,సీఎంఓఐ ప్రతినిధి పద్మ,ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ మురళి,లా ఆఫీసర్ మల్లేష్,ఇతర అధికారులు,జీఎం కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**వాజేడు సెప్టెంబర్ 12( జనం సాక్షి)** ములుగు జిల్లా వాజేడు మండలం, నాగారం చందుపట్ల గ్రామాలకు చెందిన వ్యక్తులు అనారోగ్యానికి గురై ఆసుపత్రికి వెళ్లి ఆర్థికంగా నష్టపోయి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. యాలం హనుమంతరావు, వనపర్తి సృజనకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కులు మంజూరు అయ్యాయి ఈ చెక్కులను వాజేడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకర్లపూడి విక్రాంత్ బాబు చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. నాగారం గ్రామానికి చెందిన యాలం హనుమంతరావుకు 1,50,500 రూపాయల చెక్కు మరో చెక్కు 1,47,000 చందుపట్ల గ్రామానికి చెందిన వనపర్తి సృజనకు 85 వేల రూపాయల చెక్కు అందజేయడం జరిగింది మొత్తం మూడు లక్షల 82 వేల 500 మంజూరు చేయడం జరిగింది ఈ సందర్భంగా విక్రాంత్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి సీఎం రిలీఫ్ ఫండ్ అందించడానికి కృషిచేసిన మంత్రి సీతక్కకు అదే విధంగా భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు ఎవరైనా అనారోగ్యానికి గురై ఆసుపత్రిపాలై ఆర్థికంగా నష్టపోయి ఉంటే ప్రతి ఒక్కరు సీఎం రిలీఫ్ ఫండ్‌కు అప్లై చేసుకోవాలని ప్రభుత్వం ఆదుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తల్లడి ఆదినారాయణ నల్లగాసి రమేష్ అనుముల సంజీవ బోదెబోయిన రామన్న యాలం సీతాలు తల్లడి నాన్న బాబు చింతకుంట్ల మదనయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో కివి విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు




**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 12 ( జనం సాక్షి)** ఈ నెల శ్రీ లక్ష్మి భవాని ఫంక్షన్ హాల్, మందమర్రి, మంచిర్యాల జిల్లాలో జి.యమ్.ఆర్ కరాటే మరియు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమి, తెలంగాణ, మంచిర్యాల బ్రాంచ్ వారు 5వ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ -2026 పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీలకు గాను 17 జిల్లాల నుండి 600 హాజరు అయినారు,ఇందులో వరంగల్ జిల్లా కివి పబ్లిక్ స్కూల్, కరిమాబాద్ విద్యార్థిని విద్యార్థులకు కటాస్ మరియు కుమిటే విభాగాలలో బంగారు, వెండి పథకాలు సాధించడం జరిగినదని, వీరిలో 1. జే. లలిత్, 2. యస్. సాత్విక్, 3. ఏ. ఇసాకు, 4. యమ్.యొజిత్ 5.యస్.వరుణ్ బంగారు పతకాలు పథకాలు సాధించారు. అదేవిధంగా 6.ఇ.సాత్విక్ 7. ఏ. వెంకట రమణ 8. బి.నందకిశోర్, - వెండి పథకాలు సాధించినారు, వీరిని కివి పబ్లిక్ స్కూల్ కరిమాబాద్ ప్రిన్సిపల్ దాసి సతిష్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్‌లు కోచ్‌లు బండారి సంతోష్, యు. రణదీప్, జి. వైష్ణవిలు అభినందించారని కివి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ దాసి సతీష్ మూర్తి తెలియజేసారు.

## వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

### ఎస్ఐ పోచంపల్లి సతీష్



**చిట్యాల, సెప్టెంబర్ 12( జనం సాక్షి):** వినాయక నవరాత్రి ఉత్సవాలను మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ కోరారు. చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. సతీష్ ఆదేశాల మేరకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక మండపాల కమిటీ సభ్యులతో ఎస్ఐ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసుల అనుమతులు, నిబంధనలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. వినాయక మండపాల నిర్వాహకులు ముందుగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని పోలీసుల అనుమతి పొందాలని ఎస్ఐ సూచించారు. కమిటీ సభ్యుల్లో ఒకరు తప్పనిసరిగా ఎప్పుడూ మండపం వద్ద అందుబాటులో ఉండాలన్నారు. మండపాల వద్ద డీజేలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల తర్వాత పెద్ద శబ్దాలతో పాటలు పెట్టరాదని సూచించారు. విద్యుత్ కనెక్షన్ కోసం సంబంధిత విద్యుత్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని తెలిపారు. రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా రహదారులకు పక్కన మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, స్థల యజమాని నుంచి ముందస్తు అనుమతి పొందాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి మండపం వద్ద తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించాలని కోరారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక పోలీసులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పిన పల్లా సుందర్ రాంరెడ్డి



**దేవరుప్పుల, సెప్టెంబర్ 12 (జనం సాక్షి)** దేవరుప్పుల మండలం నీర్మల గ్రామంలో ఇటీవల మృతి చెందిన సీనియర్ నాయకుడు కట్ట ఐలయ్య, నాగట్టి సిద్దయ్య కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంటి మల్లారెడ్డి, మేడ రామ్ దయాకర్, మేడ చిరంజీవి, మేడ రాంచందర్, బింగీ శ్రీనివాస్, వడ్లకొండ నరేష్, మేడ శ్రీను, మేడ శేఖర్, వడ్లకొండ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# టీకాల ద్వారా వ్యాధుల నుండి పిల్లల్ని రక్షించవచ్చు

- డిఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి
- వాక్సినేషన్ సెషన్ పర్యవేక్షణ



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 12 (జనం సాక్షి)** ప్రతి చిన్నారికి సమయానికి ఇవ్వాల్సిన టీకాలు ఇవ్వడం ద్వారా నివారించ దగ్గర వ్యాధులనుండి పిల్లలను రక్షించవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి అన్నారు . శనివారం అబ్బనికుంట అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాక్సినేషన్ సెషన్‌ను పర్యవేక్షించారు. యుపిఎచ్‌సి కీర్తినగర్ పరిధిలోని అబ్బనికుంట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న అవుట్‌రీచ్ ఇమ్యూనైజేషన్ సెషన్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్ సెషన్‌లో అందుతున్న సేవలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డ్యూ లిస్ట్ ప్రకారం పిల్లలను ముందుగానే మొబిలైజ్ చేసి, అర్హులైన ప్రతి చిన్నారికి నిర్ణీత సమయంలో టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆశా కార్యకర్తలను, ఎఎన్ఎమ్‌లను ఆదేశించారు. ప్రతి వ్యాక్సినేషన్ సెషన్‌కు అవసరమైన అన్ని రకాల వ్యాక్సిన్లను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. టీకాలు వేయించిన అనంతరం పిల్లలను కనీసం 30 నిమిషాల పాటు పరిశీలనలో ఉంచి, అనంతరం మాత్రమే తల్లిదండ్రులతో పంపించాలని సిబ్బందికి సూచించారు. జాతీయ వ్యాధి నిరోధక టీకాల షెడ్యూల్ ప్రకారం సరైన వ్యాక్సిన్, సరైన డోస్, సరైన వయస్సు/సమయంలో, నిర్ణీత విధానంలో టీకాలు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే నెలలో నిర్వహించాల్సిన అన్ని ఇమ్యూనైజేషన్ సెషన్లు తప్పనిసరిగా పూర్తి స్థాయిలో నిర్వహించి, ఒక్క అర్హత కలిగిన చిన్నారి కూడా టీకాలకు దూరం కాకుండా ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ సూచించారు. ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది కీలక పాత్ర పోషించాలి" అని డా. బి. రాజా రెడ్డి తెలిపారు.

## జనగం రాజును పరామర్శించిన దావెర అనిల్ కుమార్



**దేవరుప్పుల, సెప్టెంబర్ 12 (జనం సాక్షి):** దేవరుప్పుల మండలం చిన్నమడూర్ గ్రామానికి చెందిన జనగం రాజు ఇటీవల కాలికి గాయం కావడంతో హన్మకొండలోని రాజయ్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్ శనివారం ఆసుపత్రికి వెళ్లి జనగం రాజును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన జనగం రాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులు అందిస్తున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని దావెర అనిల్ కుమార్ ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల బీసీ సెల్ అధ్యక్షుడు కాడబోయిన గణేష్, అప్పిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కౌడగాని అనూష నరసింగరావు, మండల నాయకులు మోటికే చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు కూకట్ల కొమురయ్య, గనుపాక ప్రదీప్ పాల్గొన్నారు.



# అలసత్వం వీడండి.. వేగవంతం చేయండి

**పెండింగ్ నోటీసుల డెలివరీ, హియరింగ్‌లు, దరఖాస్తుల పరిష్కారంపై అసంతృప్తి**

**రోజువారీ లక్ష్యాలను తప్పకుండ సాధించాలి : జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**మావల ఆగస్ట్ 13 (జనం సాక్షి)**

అలసత్వశీ లేకుండా జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (సర్) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల డెలివరీ, హియ రింగ్‌లు, దరఖాస్తులు, ఫారాల డిస్పోజల్‌లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు రోజువారీ కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలని స్పష్టం చేశారు.

శనివారం తహసీల్దార్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు సంబంధిత అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా SIR ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలో మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల డెలివరీ, హియరింగ్‌లు, దరఖాస్తుల పరిష్కారం, ఫారాల డిస్పోజల్ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదిలాబాద్ అర్బన్ మండలంలో ఏఈఆర్వో పరిధిలో సుమారు 26 వేల నోటీసులు డెలివరీకి పెండింగ్‌లో ఉండగా, ఇప్పటివరకు సుమారు 600 హియరింగ్‌లు మాత్రమే పూర్తికావడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ నోటీసుల డెలివరీతో పాటు హియరింగ్‌లు, దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. బోథ్ మండలంతో పాటు నియోజకవర్గంలోని ఇతర మండలాల్లోనూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. SIR ప్రక్రియకు నవంబర్ 5వ తేదీ తుది గడువు ఉన్నందున, అందుబాటులో ఉన్న పనిదినాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ప్రతి రోజూ కనీసం 900 నోటీసులు, దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేసేలా మండలాల వారీగా కార్యాచరణ రూపొందించు కోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. రోజువారీ పురోగతిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించి పెండింగ్‌లో ఉన్న నోటీసులను సంబంధిత ఓటర్లకు వంద శాతం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నోటీసుల డెలివరీ అనంతరం హియరింగ్‌లను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, సంబంధిత ఫారాలను వెంటనే డిస్పోజ్ చేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఫస్ట్ డాక్యుమెంట్, సపోర్టింగ్ డాక్యుమెంట్లతో పాటు 1987కు ముందు, 2002కు ముందు, 2004 తర్వాత కాలానికి సంబంధించిన పత్రాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన పత్రాలను నిబంధనల మేరకు రిటర్నింగ్ అధికారికి పంపాలని, పత్రాల పరిశీలనలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం-6, తొలగింపులు, అభ్యంతరాలకు సంబంధించిన ఫారం-7, సవరణలకు సంబంధించిన ఫారం-8 దరఖాస్తులు క్షేత్రస్థాయి నుంచి సంబంధిత కార్యాలయాలకు సకాలంలో చేరేలా బీఎల్‌వోలు, ఏఈఆర్వోలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా రూపకల్పన అత్యంత కీలకమైన ప్రక్రియ అని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హులైన పేర్లను నిబంధనల ప్రకారం తొలగించేలా పారదర్శకంగా చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, నిర్దేశిత లక్ష్యాలను ప్రతిరోజూ సాధిస్తూ సర్ ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ జూమ్ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో జగదీశ్వర్ రావు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట అమరులకు ఘన నివాళులు





**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 12 (జనం సాక్షి):** చిల్పూర్ మండలంలోని లింగంపల్లి గ్రామ సిపిఎంపార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతంగా సయుధ పోరాట వారోత్సవాలు గ్రామ శాఖ కార్యదర్శి ఆవుల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వ హించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగాహాజరైన సిపిఎం మండల కార్యదర్శి సాదం రమేష్ శనివారం సిపిఎం పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచురి రెండో వర్ధంతి సందర్భంగా ఏచురి చిత్రపటా నికి పులమాల వేసి ఘనంగా నీవాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ మాట్లాడుతూ పీడిత ప్రజల ఐక్యతకు, నిరంకుశత్వ వ్యతిరేక పోరాటానికి తెలంగాణ రైతాంగ ఉద్యమమే ప్రతీక అని, నాడు నిజాం నిరంకుశ పాలనకు, ఫ్యూడల్ భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన తెలంగాణసాయుధ రైతాంగ పోరాటం భారతదేశ చరిత్రలోనే అత్యంత మహత్తరమై న ఘట్టం అని అన్నారు. దున్నేవానికే భూమి, భూమి, భుక్తి, విముక్తి అనే ప్రాథమిక నినాదా లతో 1946 నుండి 1951 వరకు సాగిన ఈ వీరోచిత పోరాటం ఏఒక్క కులానికో, మతాని కో వ్యతిరేకమైనది కాదనిఅన్నారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని,అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యతని ఈ సందర్భంగా సాయుధ పోరాట అమరుల ఆశయ సాధనకు, శ్రామిక వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పునరంకి తం కావాలని పిలుపునిచ్చారు. ఆనాడు తెలంగాణ రైతంగా సయుధ పోరాటంలో భాగస్వామిగా పోరాటం చేసీన స్వతంత్ర సమరయోధులు మోతే వెంకటయ్య, సాందో జు వెంకటాచారి లను శాలువాతో సన్మానం చేసి పులమలలతో సత్కరించారు. ఈ కార్యక్ర మంలో సిపిఎంపార్టీ మండల కమీటిసభ్యులు పోలు సంపత్,అపారదాపు రాజు, పురామని శ్రవణ్, కర్రె నాగరాజు,గుండెబోయిన సదానం దం, గుంటిపెల్లి వాజుపేయి, అపారదాపు రవి కుమార్, సంపత్, మోతే వెంకటయ్య, రచ్చ వెంకటయ్య, అపారదాపు మల్లయ్య, కండ్లకో లు ప్రవీణ్, కొత్తూరి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్రి అహల్య,మండల కార్యదర్శి మునిగెల రమేష్ అన్నారు. సీతారాం ఏచూరి రెండో వర్ధంతి సందర్భంగా స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివా ళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజకీయా ల్లో చెరగని ముద్ర వేసిన కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశ యాలను కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని అన్నారు. కార్మికులు, రైతులు, పేదలు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏచూరి నిరంతరం పోరాడారని అన్నారు. ప్రజా ఉద్య మాలను నిర్మించడంలో, వామపక్ష శక్తులను ఐక్యం చేయడంలో ఆయన కీలకపాత్ర పోషిం చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కుర్ర ఉప్పలయ్య, కత్తుల రాజు, గట్ల మల్లారెడ్డి, తోడెంగల ఐలయ్య, చిలుము ల్ల భాస్కర్, పోలాసు పరమేష్ పోలాసు కిష్ట య్య, రామగోని సతీష్,సట్ల రాజు,దైద కుమా ర్, లింగనబోయిన కుమార్, మంద మొగిలి, పోలాసు పద్మాకర్, లింగనబోయిన సుధాకర్, పోలాసుసాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణహిత వినాయక విగ్రహాల పై అవగాహన



**నస్పూర్ సెప్టెంబర్ 12(జనంసాక్షి):** నస్పూర్ లోని శ్రీ కృష్ణవేణి ప్లే అండ్ హై స్కూల్లో పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తూ విద్యార్థులు సహజసిద్ధమైన పదార్థాలతో ఎకో ఫ్రెండ్లీ గణేష్ విగ్రహాన్ని తయారు చేసి,పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బత్తిని దేవన్న మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను ఉపయోగించడం వల్ల నీటి కాలుష్యాన్ని తగ్గించవచ్చని వివరించారు. విద్యా ర్థులు ఉత్సాహంగా పాల్గొని "పర్యావరణాన్ని కాపాడుదాం -- ప్రకృతిని ప్రేమిద్దాం" అనే సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా గట్టు బానేష్



**నెన్నెల, సెప్టెంబర్ 12 (జనం సాక్షి ):** నెన్నెల: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గట్టు బానేష్‌ను జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో నెన్నెల మండల కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. పార్టీ పట్ల ఆయన చూపుతున్న అంకితభావం, చురుకైన కార్యకలాపాలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. గట్టు బానేష్‌కు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ఎస్సీ సెల్‌ను మరింత బలోపేతం చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేయాలని ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు గట్టు బానేష్ కృతజ్ఞతలు తెలిపారు.


# పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక

**అధ్యక్షులుగా సాయి చరణ్**



**మల్హర్, సెప్టెంబరు 12(జనంసాక్షి):** మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని శనివారం తాడిచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి. సాయి చరణ్, ఉపాధ్యక్షుడిగా జి. ప్రవీణ్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా పి. సతీష్, కోశాధికారిగా రజీత్, గౌరవ అధ్యక్షుడిగా మల్లికార్జున్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శివప్రసాద్, మధుకర్, రాజు, భాస్కర్, సరస్వతి, అపర్ణలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించింది.

# గణనాథుడి స్వాగతానికి సిద్ధమైన మండపాలు



**దేవరుప్పుల, సెప్టెంబర్ 12 (జనం సాక్షి):** వినాయక చవితి పండుగను పురస్కరించుకొని దేవరుప్పుల మం డలంలోని పలు గ్రామాల్లో వినాయక మండపాల ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. యువత ఆధ్వ ర్యంలో మండపాలను ఆకర్షణ ీయంగా తీర్చిదిద్దుతూ, విద్యుత్ దీపాలంకరణలు, అలంకరణ పనులు చేపడుతున్నారు. వినాయక విగ్రహాల ప్రతిష్ఠకు అవసరమైన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేస్తున్నారు. పండుగను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించేందుకు యువత ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

# దళిత జాతి జోలికి వస్తే అంతు చూస్తాం

- దళితులకు అండగా ఉండే పార్టీ కాంగ్రెస్ పార్టీ
- దళితులు వచ్చారని పసుపు నీటితో శుద్ధి చేస్తారా ?
- బిఆర్ఎస్‌లో కనీస పశ్చాత్తాపం లేకపోవడం వారి అహంకారానికి నిదర్శనం
- కెసిఆర్ దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసాల శ్రీనివాస్




**కమలాపూర్, సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :-** దళిత శాసనసభాపతి పై తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఇప్పటి వరకు బిఆర్ఎస్ పార్టీ ఖండించలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసాల శ్రీనివాస్ అన్నారు. శనివారం కమలాపూర్ మండలంలోని శనిగరం గ్రామంలో హుజురాబాద్ పరకాల రహదారి పై టిపిసిసి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేసీఆర్ దిష్టిబొమ్మ ను దహనం చేశారు. కాంగ్రెస్ శ్రేణుల ధర్నాతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వాసాల శ్రీనివాస్ మాట్లాడుతూ నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీకి హాజరు కావడం సహజమే అయినప్పటికీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఉండడంతో నిబంధనలు ఉల్లంఘించరాదని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారన్నారు. దీంతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హంగామా సృష్టించి మహిళా కానిస్టేబుల్స్‌ను అసభ్యంగా తాకడం, కేటీఆర్, కౌశిక్ రెడ్డి పోలీసులపై దాడి చేయడం, హరీష్ రావు మహిళ కానిస్టేబుల్స్ ముందు నిల్చొని బట్టలు విప్పడం వంటి నీచమైన సంస్కృతిని ఒక రోజు ముందే కేసీఆర్ ఫామ్ హౌస్‌లో శిక్షణ ఇచ్చి పంపించి ఉంటారని ఆరోపించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పోలీసులపై దాడి చేసి వారే తిరిగి మరలా పోలీసులు దాడి చేశారని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక దళిత ఎమ్మెల్యేను స్పీకర్‌ను చేస్తే అధ్యక్ష అనాల్సి వస్తుందని కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా వారి ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు బూతులు నేర్పించి తాత మధుతో అనుచిత వ్యాఖ్యలు చేయించారని మండిపడ్డారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కేసీఆర్ ఫామ్ హౌస్ వద్ద దలితులు దప్పుకొట్టి నిరసన తెలిపితే, దళితులు రావడంతో మైల పడిందనే దొర అహంకారంతో పసుపు నీటితో శుద్ధి చేయించి కేసీఆర్ దళితజాతిని ఘోరంగా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలనలో ప్రజలు ప్రశాంతంగా ఉంటే చూస్తూ ఉండలేని బిఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం అల్లకల్లోలం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి సీఎం కుర్చీ కోసం రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని చూస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలపై కేసీఆర్ బాధ్యత వహిస్తూ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం,ప్రజాస్వామ్యంపై గౌరవంతో ప్రభుత్వం,కాంగ్రెస్ పార్టీ సైనికులు ఓపికతో ఉన్నారని, మరొకసారి సీఎం రేవంత్ రెడ్డి పైన, కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే బిఆర్ఎస్ పార్టీని ఆరడుగుల గొయ్యి తీసి పాతిపెడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే దళితుల పక్షాన నిలబడుతుందని,వారి అభ్యున్నతి కోసం పాటుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఇన్చార్జిలు పాడి కల్పన, రాజేశ్వరరావు, డిసిసి జనరల్ సెక్రెటరీ మాట్ల రమేష్, డిసిసి సెక్రెటరీ విష్ణుదాసు వంశీధర్ రావు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య గౌడ్, డైరెక్టర్లు జనగాని శివకృష్ణ, గట్టు శ్రీధర్, గోపాలపూర్ సర్పంచ్ అశోక్, శనిగరం గ్రామ ఉపసర్పంచ్ భరత్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తౌటం రవీందర్, ఆడేపు విజయ ,రెక్కల నారాయణరెడ్డి, డాక్టర్ మౌటం కుమారస్వామి,తడక శ్రీకాంత్, బొల్లం రాజిరెడ్డి, గూడెపు మొగిలయ్య, నాంపల్లి ప్రభాకర్,నిగ్గుల లింగయ్య, కొండం తిరుపతి, మాట్ల కళ్యాణ్, బండి రాజేష్, ఇనుగాల సారంగపాణి,రవి యాదవ్,రీక్కల రామకృష్ణారెడ్డి, మాసు ప్రవీణ్, పెరుమండ్ల పరశు రాములు, పల్లె సమ్మిరెడ్డి, గాలిబు నవీన్, చేరాల రోహిత్, శనిగరపు రమేష్, గంధసిరి అనిల్, మౌటం నాగరాజు, జన్ను బిక్షపతి, కరట్లపెల్లి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రవేట్ ఆసుపత్రులను అకస్మిక తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ

- ప్రవేట్ ఆసుపత్రులలో ఎస్టాబ్లిష్మెంట్ చట్టం నిబంధనలు పాటించాలి
- పేషెంట్స్‌కు మానవీయ కోణంలో సేవలు అందించాలి



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :**ప్రైవేట్ ఆసుపత్రులు తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం నియమ నిబంధనలు తప్పకుండా పాటిస్తూ వైద్య సేవల నిమిత్తం వచ్చే పేషెంట్స్‌కు మానవీయ కోణంలో సేవలు అందించాలని హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ నిఖిల్ , జిల్లా మేనేజర్ శ్రీ విక్రమ్, మున్సిపల్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి రోహిణి హాస్పిటల్, ఏకశిలా హాస్పిటల్‌లను సంయుక్తంగా డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సేవలందిస్తున్న స్పెషలిస్ట్ డాక్టర్ల వివరాలు , అందిస్తున్న సేవలకు తీసుకునే ఫీజుల వివరాలతో కూడిన ధరల పట్టిక, మరియు వివిధ ప్రభుత్వ అనుమతులకు సంబంధించిన అనుమతులు వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ , సీఎంఆర్ఎఫ్, మరియు ఇతర విభాగాల ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. డిఎంహెచ్ఓ కార్యాలయానికి సమర్పించవలసిన వివిధ రిపోర్టులను సకాలంలో అందజేయాలన్నారు. అక్కడ అందిస్తున్న సేవలకు సంబంధించిన ఫీజుల పట్టిక వచ్చిన వారికి కనిపించే విధంగా తగినంత సైజులో ప్రముఖంగా ప్రదర్శించకపోవడం , గుర్తించిన ఇతర లోపాలకు సంబంధించి రెండు ఆసుపత్రులకు కూడా నోటీసులు జారీ చేస్తామని డాక్టర్ అప్పయ్య తెలియజేశారు .ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం కన్సల్టేషన్ ఫీజులు, వైద్య సేవలకు ఎంత తీసుకోవాలి అనే ధరల పట్టికను, సేవలు అందిస్తున్న డాక్టర్స్ వివరాలను పేషెంట్లు వారి సహాయకులు క్లినిక్లు లేదా ఆసుపత్రులకు వెళ్ళినప్పుడు పరిశీలించాలన్నారు.

# మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యం పంపిణీ



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 12( జనం సాక్షి):** మృతురాలి కుటుంబానికి బిఆర్ఎస్ నాయకులు ఆర్థిక సహాయంగా బియ్యాన్ని పంపిణీ చేశారు. మండలంలోని పాత ముగ్ధంపురం గ్రామానికి చెందిన బొల్లెన విజయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. స్థానిక బిఆర్ఎస్ నాయకులు మృతురాలి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బండారి సత్యం గౌడ్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు సయ్యద్ బషీర్, ఉపాధ్యక్షులు పోలెపల్లి రమేష్ ,మాజీ ఉపసర్పంచ్ మేకల సదయ్య, పార్టీ సీనియర్ నాయకులు నాంపల్లి మల్లయ్య, దొనికెల చంద్రమౌళి, నాంపల్లి రాములు, శంకేసి భద్రయ్య, మంచిక రమేష్, మైదం బాబు, కల్వచర్ల వెంకన్న, పోలెపల్లి యాకాంభ్రం, సయ్యద్ అంకూస్, కొయ్యల భాస్కర్, పాల్గొన్నారు.

# నేడు ఆదివారం ఎన్‌డీఏ, ఎన్ఏ, సీడీఎస్ పరీక్షలు

## పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఎన్. రవి, కేంద్ర పరిశీలకులు ఉమేష్ కుమార్ మీనా



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :**హనుమకొండ జిల్లాలో ఈ నెల 13న ఆదివారం జరగనున్న నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావల్ అకాడమీ ఎన్‌డీఏ, ఎన్ఏ-2, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ సీడీఎస్-2 పరీక్షలను నిర్వహించే పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి శనివారం పరిశీలించారు. హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి బాలికల డిగ్రీ, పీజీ కళాశాలలను అదనపు కలెక్టర్ రవి, కేంద్ర పరిశీలకులు ఉమేష్ కుమార్ మీనా సందర్శించి పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.పరీక్షా గదులు, అభ్యర్థులకు కల్పిస్తున్న తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ తదితర ఏర్పాట్లను వారు పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా, సజావుగా జరిగేవిధంగా బాధ్యతలు నిర్వర్తించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి,అడిషనల్ తహసీల్దార్లు రవి, రమేష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వం మంజూరు చేస్తే ఎన్నికల హామీ అంటారా



**మల్హర్, సెప్టెంబర్ 12(జనంసాక్షి)** కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు అజ్మీరా రాజ్ నాయక్ మాట్లాడుతూ పల్లెల్లో నీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు భాగంగా రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు సూచన మేరకు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డిఎంఎఫ్టి నిధుల ద్వారా మంథని నియోజకవర్గంలో పదుల సంఖ్యలో బోరు బావులు మంజూరు చేసినారు. మండలంలో దాదాపు 18 బోరు బావులు మంజూరు చేయడం జరిగింది.ఇందులో భాగంగా మన అడ్వాలపల్లి పల్లి గ్రామంలో బీసీ కాలనీ, జిపి ఆఫీస్ వద్ద రెండు బోర్ బావులు మంజూరు చేసినట్లుగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అజ్మీర రాజనాయకు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు బోర్ బావులు మంజూరు నేపథ్యంలో జిపిల తీర్మానాలతో కొన్ని గ్రామాల్లో సర్పంచులు కొన్ని గ్రామాల్లో కాంట్రాక్టర్లు చేస్తున్నట్లుగా తెలిపారు.అడ్వలా పల్లి గ్రామ ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుంట మంజూరు చేసిన బోర్ బావులను తాను ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం బోరు వేయించాను అని సర్పంచ్ చెప్పుకోవడం సరికాదు అన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తే పంచాయతీ తీర్మానం మేరకు బోర్ వేయడం జరిగిందని తెలిపారు.

# అడవులు,వన్య ప్రాణాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## గూడూరు ఫారెస్ట్ రేంజర్ అధికారి జి.ప్రసాదరావు



**గూడూరు,సెప్టెంబర్12(జనంసాక్షి):**అడవులు,వన్యప్రాణాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని గూడూరు అటవీ శాఖ రేంజ్ అధికారిజి ప్రసాదరావుఅన్నారు. శనివారం జిల్లా అధికారులు శ్రీమన్నారాయణ రెడ్డి, రాజేంద్రప్రసాద్,లతో కలిసి కొత్తగూడ మండలం శ్రీ గుంజేడు ముసలమ్మ తల్లి, దేవాలయ ప్రాంగణం, భీముని పాదం,అటవీ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ప్రసాద రావు మాట్లాడుతూ..అడవులు, వన్యప్రాణుల సంరక్షణ -- మనందరి బాధ్యతమానవ మనుగడకు, పర్యావరణ సమతుల్యతకు అడవులు, వన్యప్రాణులు అత్యంత కీలకమైనవి. అడవులు మనకు స్వచ్ఛమైన గాలి, నీరు, వర్షాలు మరియు ప్రాణవాయువును అందిస్తే, వన్యప్రాణులు ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే పెరుగుతున్న పట్టణీకరణ, అటవీ నిర్మూలన, మరియు మానవ కార్యకలాపాల వల్ల అనేక రకాల జీవరాశులు అంతరించిపోయే ప్రమాదంలో పడ్డాయి.అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అటవీ మరియు పర్యావరణ శాఖ పిలుపునిస్తోంది.అటవీ విస్తీర్ణాన్ని పెంచడం..మన ఇంటి పరిసరాల్లో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలి. అడవులను నరకడం, చెట్లను నరికివేయడం చట్టరీత్యా నేరం. వన్యప్రాణుల రక్షణ: వన్యప్రాణులను వేటాడటం,వాటి సహజ ఆవాసాలను నాశనం చేయడం తీవ్రమైన నేరం. వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టకూడదు.ప్లాస్టిక్ వాడకం నివారణ: అటవీ ప్రాంతాల్లోకి విహారయాత్రలకు వెళ్లేటప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడం వల్ల అడవి జంతువులు ప్రమాదంలో పడుతున్నాయి. కాబట్టి అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలి.అటవీ అగ్నిప్రమాదాల అరికట్టడం..అడవుల్లో నిర్లక్ష్యంగా నిప్పు పెట్టడం వల్ల వేలాది ఎకరాల అడవితో పాటు అరుదైన జీవరాశులు బూడిదవుతున్నాయి. ప్రజలు ఈ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి.ఈసందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు.వన్యప్రాణులు గాయపడినా లేదా గ్రామాలలోకి పట్టణాల్లోకి వచ్చినా ప్రజలు స్వయంగా వాటిపై దాడి చేయకుండా,వెంటనే సమీపంలోని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలిని పిలుపునిచ్చారు.ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,జిల్లా ఫారెస్ట్ అధికారి లావణ్య, సూచనల ప్రకారం జిల్లాలో అడవి,వన్యప్రాణాల సంరక్షణ హరిత హారం, వనమహోత్సవం కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని,జిల్లా వ్యాప్తంగా టెంపుల్ టూరిజం అభివృద్ధి కోసం కృషి చేయడం జరుగుతుందని అన్నారు.

# ఎస్టీ వర్గీకరణ చేపట్టాలి

తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాపు.



బెల్లంపల్లి, సెప్టెంబర్ 12, (జనంసాక్షి)ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాపు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 76 ఏళ్లుగా చట్టసభలలో అవకాశం రాని ఆదివాసి ఎరుకల సామాజిక వర్గానికి రాజకీయ అవకాశాలు కల్పించాలని, అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన రాజ్యాంగ హక్కుల కోసం పోరాటం చేస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎరుకల సమాజం విద్యా, ఉద్యోగ, ఉపాధి, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయ అవకాశాలు అందక చాలా వెనుకబడి ఉన్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ అభివృద్ధి పథకాలు అందక అభివృద్ధిలో ఇతర ఆదివాసి గిరిజనులతో పోల్చుకుంటే అత్యధికంగా వెనుకబడి ఉన్నారని వివరించారు. ఎరుకల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వము ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ట్రైకార్ సంస్థ ద్వారా ఎరుకలకు ఎటువంటి లాభము చేకూర్చడము లేదని, మైదాన ప్రాంతంలో అత్యధికంగా జీవిస్తున్న ఆదివాసి ఎరుకల కుటుంబాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఐటిడిఏను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 56 (ఎరుకల ఎంపవర్‌మెంట్ స్కీమ్) ని అమలు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా పందుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న పందుల పెంపకందారుల అభివృద్ధి కోసం ఎరుకల ఎంపవర్‌మెంట్ స్కీమ్ ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. నిరుపేద ఆదివాసి ఎరుకల కుటుంబాల అభివృద్ధి కోసం ఎస్టి కార్పొరేషన్ ద్వారా ప్రతి ఆదివాసి ఎరుకల కుటుంబానికి 12 లక్షల రూపాయల బ్యాంకులతో సంబంధం లేకుండా 100% సబ్సిడీతో రుణాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వము 1996లో ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసినట్టుగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము 2014లో ప్రత్యేక ఎస్టీ కమిషన్ఏర్పాటు చేసినట్టుగా, తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఉండడం వల్ల ఆదివాసి గిరిజన సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశాలు ఉన్నాయని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

# ప్రజాపాలనతోనే పల్లెల అభివృద్ధి సాధ్యం

## సర్పంచుల చేరికతో మరింత బలపడనున్న బజార్హత్నూర్ కాంగ్రెస్ పార్టీ



**బజార్హత్నూర్ ( జనం సాక్షి):-** బజార్హత్నూర్ మండలం లోని గిరిజాయి, భూతాయి కే, ధర్మపురి సర్పంచులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు చేరుతున్న సంక్షేమ పథకాలు, మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని అన్నారు. గిరిజాయి సర్పంచ్ పెందూర్ అరవింద్, భూతాయి కే సర్పంచ్ మడావి జైతు, ధర్మపురి సర్పంచ్ ఆర్క యాదవరావు, సీనియర్ నాయకులు కుమ్ర మారుతి మాజీ ఎంపీ సోయం బాపురావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ గతంలో మరియు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే బజార్హత్నూర్ మండలంలోని గిరిజన గ్రామాలు అన్నింటికీ రోడ్డు సౌకర్యం, ఇందిరమ్మ ఇల్లు, పోడు భూములకు పట్టాలు అందాయని, 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో బజార్హత్నూర్ మండలానికి చేసిన అభివృద్ధి శూన్యమని ఆయన విమర్శించారుకొంతమంది నాయకులు బజారత్నూర్ మండలానికి ఎటువంటి అభివృద్ధి చేయకపోయినా సోషల్ మీడియాలో హడావుడి చేస్తున్నారని ఎవరి క్షేత్రస్థాయిపరిస్థితి ఏమిటో ఈ చేరికలే తెలుపుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మాజీ బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, అందుర్ గ్రామ సర్పంచ్ పెందూర్ పృథ్వీరాజ్, మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరేపల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ కుర్రే మల్లయ్య యాదవ్



**టేకుమట్ల సెప్టెంబర్ 12 జనంసాక్షి :** టేకుమట్ల మండలంలోని ఆరెపల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డ్ రేషన్ షాప్ డీలర్ వద్దా ప్రభుత్వం నుండి ఉచితంగా వచ్చేసన్నబియ్యం కోసం కొత్తగా ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను టేకుమట్ల మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు ఆరెపల్లి సర్పంచ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం రేషన్ కార్డ్ దారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న భారతదేశంలోనే ఏకైక ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని ఎల్లప్పుడూ కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆయన తెలియజేశారు రేషన్ కార్డు దారులు హర్షం వ్యక్తం చేసారు ఇట్టి కార్యక్రమంలో ఉప సర్పంచ్ గురిజాల మల్లారావ్ వార్డుమెంబెర్స్ కొడారి. సహేందర్ వంగ వేణు గురిజాల. రాధిక భాషవేనా అనిత ఎండీ . రేష్మ గోపు కవిత డీలర్ సుజాత గ్రామప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితుడికి అందజేసిన ఎస్సై




**దేవరుప్పుల, సెప్టెంబర్ 12 (జనం సాక్షి):** దేవరుప్పుల మండలం రాంబోజిగూడెం గ్రామానికి చెందిన రాంపల్లి యాదగిరి 2025 అక్టోబర్ 23న తన ఫోన్ పోగొట్టుకున్నాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందించగా, సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేసి గుర్తించారు. అనంతరం శనివారం ఎస్సై సృజన్ కుమార్ ఫోన్‌ను యాదగిరికి అందజేశారు. పోగొట్టుకున్న ఫోన్‌ను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి తిరిగి అందించిన పోలీసులకు యాదగిరి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో యాకూబ్ పాల్గొన్నారు

## ఘనంగా సత్యపాల్ రావు జన్మదిన వేడుకలు



**కాసిపేట సెప్టెంబర్ 12 ( జనం సాక్షి )**దేవాపూర్ ఓరియంట్ (అదానీ) సిమెంట్ కంపెనీ యూనియన్ అధ్యక్షులు కొక్కిరాల సత్యపాల్ రావు గారి జన్మదిన వేడుకలను శనివారం కాసిపేట మండలంలో ఘనంగా నిర్వహించారు. డిసీసీ జనరల్ సెక్రటరీ వేముల కృష్ణ ఆధ్వర్యంలో ధర్మారావుపేట రామాలయంలో అర్చనా చేయించి పూజలు నిర్వహించారు. వేముల కృష్ణ మాట్లాడుతూ సత్యపాల్ రావు గారు నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలతో ఉండాలని రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయన అన్నారు.అనంతరం మండలంలోని దేవాపూర్, ధర్మారావు పేట, మల్కేపల్లి, కోమటి చేను, సోనాపూర్, గట్రావుపల్లి, లంబాడి తండా ( డి ) కొండాపూర్, లంబాడి తండా( కే )పలు గ్రామ పంచాయతీలలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ధర్మారావు పేట మాజీ ఎంపీటీసీ పార్వతీ మల్లేష్,ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్ లు, రాందాస్, రఘుపతి, రాధ, శైలజ రాజు, మాణిక్యం శంకర్, బలరాం,మహేందర్,ఉప సర్పంచ్ లు గోపు శ్రీనివాస్,కూకట్ల దేవేందర్ , జంజీరాల సందీప్, అనంతరావు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనుకుల రాకేష్,నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు

# మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం

## ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: కాళేశ్వరం ఉప సర్పంచ్ సుధీర్



కాళేశ్వరం , సెప్టెంబర్ 12 , ( జనం సాక్షి) వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ జరుపుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని కాళేశ్వరం గ్రామ ఉప సర్పంచ్ చెమ్మల సుధీర్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించి, పర్యావరణహితమైన పండుగను నిర్వహించాలని ఆయన కోరారు. మట్టి సహజసిద్ధమైన పదార్థం కావడంతో మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోతాయని, తద్వారా చెరువులు, నదులు, వాగులు వంటి నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. భక్తి పేరుతో ప్రకృతికి హాని కలగకూడదు. మన పండుగ ఆనందం మన నీటి వనరులకు, జలచరాలకు నష్టం కలిగించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి అని సుధీర్ కుమార్ అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు, రసాయన రంగుల వినియోగం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని,5 పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. మన భక్తి -- ప్రకృతి పరిరక్షణకు బాట కావాలి అని అన్నారు. మన పూర్వీకుల సంప్రదాయాలను కొనసాగిస్తూ సహజమైన మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని, ముఖ్యంగా చిన్నారుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాలని ఆయన సూచించారు.మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిద్దాం.కాలుష్యాన్ని నివారిద్దాం.ప్రకృతిని పరిరక్షిద్దాం. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందిద్దాం అని ఆయన పిలుపునిచ్చారు. కాళేశ్వరం గ్రామ ప్రజలందరూ పర్యావరణహితమైన వినాయక చవితి నిర్వహణకు ముందుకు వచ్చి, మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్ఠకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉప సర్పంచ్ చెమ్మల సుధీర్ కుమార్ కోరారు.

# టిబి పోషణ కిట్ల పంపిణీ: డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య



హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 12 (జనం సాక్షి) :టిబి పేషంట్స్ చికిత్స సమయంలో పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని మానసికంగా ధైర్యంగా ఉండాలని హనుమకొండ జిల్లా వైద్య అధికారి డాక్టర్ అల్లం అప్పయ్య అన్నారు .టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం తేది 12 న జిల్లా వైద్య అధికారి కార్యాలయంలో టీబి వ్యాధితో బాధపడుతున్న పదిమందికి 10 నిక్షయ్ పోషణ కిట్లను జిల్లా డాక్టర్ అప్పయ్య మరియు డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఇంచార్జ్ క్షయ నివారణ అధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి టీబీ పేషెంట్లకు పోషణ కిట్లను పంపిణీ చేయడం జరిగినది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతతో క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవడానికి ముందుకు రావాలని, టీబి అంతంలో నిశ్చాయ్ మిత్ర పాత్ర గుండెకాయ లాంటిది, టీబీ వ్యాధితో బాధ పడుతున్న వారికీ వారికి చికిత్స సమయంలో పోషణ సహకారంను అందించినట్లయితే సమాజంలో క్షయ వ్యాధినీ నియంత్రించడం సాధ్యముతుందని, టీబీ అంతశీ మనందరి పంతం కావాలని తెలపడం జరిగినది ఈ సందర్భంగా డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ క్షయ వ్యాధి లేని సమాజాన్ని నిర్మించాలని దానికి అందరి సహకారం అవసరమని ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలపడం జరిగినది ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మాధవ రెడ్డి,టిబి కోఆర్డినేటర్లు కిరణ్ , నగేష్ మరియు సూపర్వైజర్ విజయ్ మరియు స్టాఫ్ పాల్గొనడం జరిగినది

# సెప్టెంబర్ 16న జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు

## అంగన్వాడీ, ఆశా వర్కర్లను అడ్డుకోవడం దుర్మార్గం: సీఐటీయూ



నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 12,(జనంసాక్షి ): కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. ఉద్యమాలను అణచివేసే చర్యలకు పాల్పడటం దుర్మార్గమని సీఐటీయూ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శనివారం నిర్మల్‌లోని టీఎన్జీవో భవన్‌లో అంగన్వాడీ యూనియన్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌కు వెళ్తున్న అంగన్వాడీ, ఆశా వర్కర్లను అర్ధరాత్రి బస్సుల్లో నుంచి దింపి అరెస్టు చేయడం సరికాదన్నారు. సెప్టెంబర్ 8, 9 తేదీల్లో చేపట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం నిర్బంధ చర్యలకు పాల్పడిందని ఆరోపించారు. నాయకులను ముందురోజే గృహ నిర్బంధం చేయడంతోపాటు అరెస్టులు చేశారని, సీఐటీయూ రాష్ట్ర నాయకులను పోలీసులు తెల్లవారుజాము నుంచే వెంటాడారని తెలిపారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.

**ధర్నా చౌక్‌పై నిషేధం ఎత్తివేయాలి**

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం హరించరాదన్నారు. ధర్నా చౌక్‌పై కొనసాగుతున్న అప్రకటిత నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమీపంలోని జంతర్‌మంతర్‌లో వివిధ రాజకీయ, ప్రజా సంఘాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నాయని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో మాత్రం కార్మిక సంఘాల ఆందోళనలకు అనుమతులు ఇవ్వకపోవడం సరికాదన్నారు.

**జిల్లా కేంద్రాల్లో సామూహిక దీక్షలు**

ప్రభుత్వ నిర్బంధ చర్యలకు నిరసనగా ఈ నెల 16న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో సామూహిక నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు సురేష్ తెలిపారు. కార్మికులు, అంగన్వాడీ, ఆశా తదితర స్కీమ్ వర్కర్లు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.లలిత, ప్రధాన కార్యదర్శి వి.శైలజ, పట్టణ కార్యదర్శి కవిత, చంద్రకళ, రా.ఉమా, అమృత, రాజ్యలక్ష్మి, సరూప తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర ధరల పెరుగుదలతో పేదలపై పెనుభారం



నల్లబెల్లి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి ): నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని ఏఐఎస్‌డబ్ల్యు వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి మార్త సుధ అన్నారు. శనివారం నల్లబెల్లి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్యాస్ సిలిండర్ ధర రూ.1,000కు చేరడంతో సామాన్య కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. గ్యాస్ కొనుగోలు చేయలేక కొందరు తిరిగి కట్టెల పొయ్యిలను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. మార్కెట్‌లో కిలో ఉల్లిగడ్డ రూ.100, లీటరు వంటనూనె ప్యాకెట్ రూ.200 వరకు పలుకుతోందన్నారు. కందిపప్పు, పెసరపప్పు, బియ్యం, చింతపండు, పంచదార తదితర నిత్యావసర సరుకుల ధరలు కూడా గణనీయంగా పెరిగాయని తెలిపారు. ధరల పెరుగుదలతో కూలీ పనులు చేసుకునే మహిళలు కుటుంబాలను పోషించలేక అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర ధరలను నియంత్రించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. వెంటనే గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించి పేద, మధ్యతరగతి ప్రజలను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం

## ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధ



చెన్నారావుపేట, సెప్టెంబర్ 12 ( జనం సాక్షి): మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో పోషకాహార వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెన్నారావుపేట ఐసిడిఎస్ సూపర్వైజర్ కే. రాధ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానంపై చైతన్యం తీసుకురావడమే పోషణ మాసం ప్రధాన లక్ష్యమని అన్నారు.ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే ఆహారం తల్లి ఆరోగ్యంతో పాటు గర్భంలోని శిశువు ఎదుగుదలపై కూడా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్ చిలపాక అనిత మొగిలి మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు ప్రతిరోజూ ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పాలు, గుడ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పి. విజయలక్ష్మి, బి. రజిత, ఎం. సరోజన, ఏఎన్ఎం రమ, ఆయాలు ఏ. నీలమ్మ, కట్టమ్మ, శారద, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# మహాసభలను విజయవంతం చేయాలి: జానవిజ్ఞాన వేదిక



నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 12,(జనంసాక్షి ) జన విజ్ఞాన వేదిక నిర్మల్ జిల్లా మహాసభల సన్నాహక సమావేశం శనివారం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అంకం గంగాధర్, కార్యదర్శి షేక్ రఫీక్ మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 10 గంటలకు టీఎన్జీవో భవన్‌లో మహాసభలు ప్రారంభమవుతాయని తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల వరప్రసాద్ హాజరవుతారని, అ.ప్రొ. వెల్మల మధు 'ఎల్‌నినో--ఋతుపవనాలపై ప్రభావం', డిప్యూటీ ఎఫ్ఆర్ఓ మహ్మద్ నజీర్‌ఖాన్ 'అడవులు--వర్షాల నేస్తాలు, భూగర్భ జల భాండాగారాలు' అంశాలపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సభ్యులు, విద్యావంతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆకుల సుదర్శన్, కొండా రాములు, చెకుముకి కన్వీనర్ గాజుల నారాయణవర్మ, విద్య కమిటీ కన్వీనర్ గజపల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

### నిర్మల్ జిల్లా డీ ఎస్పీ శ్రీనివాస్



**ఖానాపూర్ రూరల్ 12 సెప్టెంబర్ (జనం సాక్షి):** గణపతి నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని నిర్మల్ జిల్లా డిఎస్పి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక సీఎం రావు ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఎస్సై రాహుల్ గైక్వాడ్ సారాధ్యంలో నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఈ సమావేశానికి ఖానాపూర్ పట్టణంలోని ప్రతి గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా డిఎస్పి శ్రీనివాస్ మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు ఎప్పటికప్పుడు పాటించాలని అదేవిధంగా గణపతి ప్రతిష్టాపన నుండి నిమజ్జనం వరకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి గణపతి మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉంచాలని ఆయన అన్నారు. గణపతి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆయన అన్నారు. అనంతరం ఎస్సై రాహుల్ గైక్వాడ్ మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వారి ఆన్లైన్ అప్లికేషన్ వివరాలను సమర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కడెం ఎస్సై సాయికుమార్ ఏఎస్ఐలు పోలీస్ సిబ్బంది ఖానాపూర్ హిందూ ఉత్సవ సమితి వివిధ గణపతి మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి



**తొర్రూరు ,సెప్టెంబర్ 12 (జనం సాక్షి):** నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణ సంస్థానం సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి ప్రత్యేక చొరవ ద్వారా భారత దేశంలో విలీనం అయిన సెప్టెంబర్ 17 న తెలంగాణా విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ డిమాండ్ చేశారు.ఈరోజు తొర్రూరు పట్టణంలో స్థానిక గెస్ట్ హౌస్ లో బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ సభాధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశానికి ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధిస్తే నిజాం నిరంకుశ పాలన లో ఉన్న తెలంగాణ ప్రాంతానికి సెప్టెంబర్ 17 న స్వాతంత్ర్యం వచ్చింది అని తెలిపారు.నిజాం నిరంకుశ పాలన లో తెలంగాణ ప్రజలు నరకం చవిచూశారు అని, రకరకాల పన్నులతో పాటు ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చుకు తిన్నారని, విచ్చల విడిగా మత మార్పిడిలకు పాల్పడి ఎదురు తిరిగిన ప్రజలను చిత్ర హింసలకు గురిచేశారని,మహిళల మాన ప్రాణాలను తీసేసారని, చివరికి తెలంగాణ ప్రాంతాన్ని పాకిస్థాన్ లో కలుపడానికి కుట్రలు పన్నిన నిజాం నవాబు ధాష్టీకాలను అప్పటి భారత ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రత్యేక చొరవ చూపి ఆపరేషన్ పోలో ద్వారా నిజాం నవాబు మెడలు వంచి తెలంగాణ కు విముక్తి కల్పించాడని అలాంటి ప్రాముఖ్యత కలిగిన సెప్టెంబర్ 17 న ప్రభుత్వం అధికారికంగా వేడుకలు నిర్వహించక పోవడం వెనుక కేవలం ముస్లిం ఓటు బ్యాంకు, మజ్లిస్ పార్టీ ఒత్తిడి కారణం అని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా ఈ ఉత్సవాలను అధికార లాంఛనాలతో నిర్వహిస్తూ తెలంగాణ విమోచనోద్యమం లో అసువులు బాసిన అమర వీరుల కు ఘన నివాళులు అర్పించడం జరుగుతుంది అని తెలిపారు.తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చాక తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించి తెలంగాణ ప్రజల మనోభావాలను, ఆత్మ గౌరవాన్ని కాపాడుతామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లేగా రాంమోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్,రంగు రాములు, చింతా స్రృజన్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలుపుల శంకర్, తొర్రూరు రూరల్ మండలం అద్యక్షులు గట్టు రాంబాబు, పెద్దవంగర మండల అధ్యక్షుడు కట్టోజు భాస్కరా చారి, జిల్లా నాయకులు పూసాల శ్రీమాన్, అలిసేరి రవిబాబు, దేవరకొండ విష్ణు, మండల ప్రధాన కార్యదర్శి నడిగడ్డ సందీప్, బీజేవైఎం జిల్లా నాయకులు నూకల నవీన్,తూర్పాటి సాయి ముకేష్,తూర్పాటి మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శలో విద్యార్థులకు మాక్ పోలింగ్

### స్కూల్ లీడర్‌తో పాటు పలు పదవులకు ఎన్నికలు




**కాటారం సెప్టెంబర్ 12 (జనం సాక్షి):** విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాధాన్యత, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో శనివారం మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికల నిర్వహణపై ప్రత్యక్ష అనుభవం కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులే అభ్యర్థులుగా, ఓటర్లుగా, పోలింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందిగా వివిధ పాత్రలను పోషించారు. పాఠశాల స్కూల్ లీడర్‌తో పాటు హౌస్ కేప్టెన్స్ , స్పోర్ట్స్ లీడర్ , పలు నాయకత్వ పదవులకు ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటర్ల గుర్తింపు, ఓటింగ్ విధానం, పోలింగ్ కేంద్రం నిర్వహణ, ఓటు నమోదు, ఈవీఎం వినియోగం, ఎన్నికల నియమ నిబంధనలు తదితర అంశాలను విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ప్రత్యేకంగా ఈవీఎంలను ఏర్పాటు చేసి విద్యార్థులతో మాక్ ఓటింగ్ నిర్వహించడం ద్వారా ఎన్నికల ప్రక్రియపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్‌కు ముందు విద్యార్థులకు ఓటు హక్కు విలువ, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత, బాధ్యతాయుతమైన ఓటరు పాత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు మాట్లాడుతూ.. "మాక్ పోలింగ్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు హక్కు, ఎన్నికల నిర్వహణపై పుస్తక పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ అవగాహన కలుగుతుంది. చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్య విలువలను అర్థం చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుతమైన ఓటర్లుగా ఎదిగేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి టీ జీ ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ రోబోటిక్స్ శిక్షణ




జనం సాక్షి ఎల్క్ తుర్తి :మండల కేంద్రములో ఉన్న టీ జి ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ లో రోబోటిక్స్ లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమావతి అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్ఫేర్ కార్యక్రమంలో భాగంగా సోహం అకాడమీ ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు హాండ్స్ ఆన్ రోబోటిక్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని. రోబోటిక్స్ సంబంధించిన ప్రాథమిక అంశాలను పరిచయం చేస్తూ పలు హాండ్స్ -ఆన్ ఆక్టివిటీలను ఏర్పాటు చేసి విద్యార్థుల నైపుణ్యతను పెంచుతున్నామని అన్నారు అలాగే సెన్సార్లు ప్రాథమిక ఎలక్ట్రానిక్ పరికరాలు, ప్రోగ్రామింగ్ తదితర అంశాలను ప్రయోగాత్మకంగా చేసి చూపించి మైండ్ స్పార్క్ తో పాటు అబ్ కాస్ లాంటి సైంట్ పీక్ గా నేర్పిస్తున్నామని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బుగులు వెంకటేశ్వర స్వామి కళ్యాణం

### హాజరైన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు



**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 12 (జనంసాక్షి)** :చిల్పూర్ మండల కేంద్రంలోని చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ఆలయ ఈవో బి లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో స్వామి వారి వార కళ్యాణము వేదమంత్రోచరణలతో అర్చకులు వైభవంగా నిర్వహించారు. కళ్యాణం లో వివిధ గ్రామాల నుండి పట్టణాలనుండి భక్తులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు తీసుకున్నా రు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు,ధర్మకర్త మండలి సభ్యు లు గోలీ రాజశేఖర్, వేముల వెంకటేశ్వర్లు, ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న,ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీరంగాచార్యులు,కృష్ణమాచార్యులు, ఆదిత్య అన్నప్రసాద దాతలు రావు అన్సిత వెంకట ఆశ్రిత, పాలిన అప్పలస్వామి -సత్యా వతి,సానికొమ్ము వెంకట్ రెడ్డి - వెంకటరత్తమ్మ,గానగాని ఆనంద్ - నిర్మల,ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఏబీవీపి నాయకుడు ముందస్తు అరెస్టు




**తొర్రూరు ,సెప్టెంబర్ 12 ( జనం సాక్షి):** పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను చెల్లించ కుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈరోజు ఏబీవీపి ఆద్వర్యంలో రాష్ట్ర అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈరోజు తొర్రూరు పట్టణంలో పోలీసులు అర్ధరాత్రి ఏబీవీపి మండల కన్వీనర్ చిలుక మనోజ్ ను ముందస్తుగా అరెస్టు చేయడం జరిగింది.అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.ఈసందర్భంగా ఏబీవీపి తొర్రూరు మండల కన్వీనర్ చిలుక మనోజ్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను చెల్లించకుండా 40లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చెలగాటం ఆడుతున్నారు అని, స్కాలర్షిప్ లు భిక్ష కాదు ప్రభుత్వ బాధ్యత అని గుర్తెరిగి వెంటనే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.మౌనం వీడి రేవంత్ రెడ్డి సర్కారు పై ఒత్తిడి పెంచి విద్యార్థులకు స్కాలర్ షిప్పులు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోనే విధంగా చొరవ చూపి తన చిత్త శుద్ధి ని చాటుకోవాలని రాహుల్ గాంధీకి హితవు పలికారు.

# ప్రత్యేక ప్రచార దినాలను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి
- ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి




**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 12(జనంసాక్షి).** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినాలను అర్హులైన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి సూచించారు. శనివారం ములుగు, మల్లంపల్లి, వెంకటాపురం మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నమోదు అధికారి తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారుల అందుబాటు, ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులు, క్లెయిమ్స్, అభ్యంతరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడంతోపాటు ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా బూత్ స్థాయి అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం--6, పేర్ల తొలగింపునకు ఫారం--7, వివరాల సవరణకు ఫారం--8 దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. ఓటర్ల నుంచి అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. ప్రత్యేక ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు తహసీల్దార్ ఎన్ విజయభాస్కర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నగేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, రాజేందర్, జూనియర్ అసిస్టెంట్ సాత్విక్, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'నాతోనే మార్పు' కార్యక్రమంలో
## తల్లిదండ్రులు-ఉపాధ్యాయులు-విద్యార్థుల బలమైన అనుబంధంపై అవగాహన



**ఏటూరునాగారం,సెప్టెంబర్ 12(జనంసాక్షి).** తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం జూనియర్ కాలేజ్ (గర్ల్స్) ఏటూరునాగారంలో 'నాతోనే మార్పు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం విద్యార్థులు చెడు వ్యసనాలు, మొబైల్ ఫోన్ అధిక వినియోగం వంటి అలవాట్లకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలి, సత్ప్రవర్తన, క్రమశిక్షణతో విద్యను కొనసాగించేలా అవగాహన కల్పించడం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాదిక్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును కాపాడడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య బలమైన అనుబంధం ఎంతో అవసరమని అన్నారు. పిల్లల భావాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అర్థం చేసుకుని వారికి అండగా నిలవాలని సూచించారు. "ప్రేమతో కలుద్దాం -- బాధ్యతతో వ్యవహరిద్దాం, బడిని వదలొద్దు -- భవిష్యత్తును కోల్పోవద్దు, విని అర్థం చేసుకుందాం -- తోడుగా నిలుద్దాం" అనే సందేశంతో విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. మొబైల్ ఫోన్‌కు బానిస కాకుండా జాగ్రత్త వహించాలని, చెడు వ్యసనాలు మరియు ఆకర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు, ఎవరితో స్నేహం చేస్తున్నారు, వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది అనే విషయాలను ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు. పిల్లలను కళాశాలలో చేర్పించే సమయంలో వారి ఆరోగ్య పరిస్థితి, ప్రత్యేక అవసరాలు వంటి విషయాలను ఉపాధ్యాయులకు తప్పనిసరిగా తెలియజేయాలని తల్లిదండ్రులకు సూచించారు. "నా బిడ్డ ఆరోగ్యం -- నా బాధ్యత, మా బడి -- మా గుడి" అనే భావనతో తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, ప్రవర్తన, భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సాదిక్ తెలిపారు. పిల్లల భవిష్యత్తును మంచి మార్గంలో నడిపించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. విమల మాట్లాడుతూ, నేటి సమాజంలో విద్యార్థులు వివిధ చెడు అలవాట్లకు ఆకర్షితులయ్యే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు ఇంటికి వచ్చినప్పుడు వారి చదువు, కళాశాల అనుభవాలు, స్నేహితులు, ప్రవర్తన తదితర విషయాలను ప్రేమగా అడిగి తెలుసుకోవాలని అన్నారు. అలాగే, తమ పిల్లలు కళాశాలలో ఎలా ఉంటున్నారనే విషయాన్ని సంబంధిత హౌస్ మాస్టర్లను అడిగి తెలుసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కళాశాలలో విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి వారి విద్య, ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తు కోసం శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ పిల్లలను ఇంటి వద్ద కూడా జాగ్రత్తగా గమనిస్తూ, వారి చదువు మరియు ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని ప్రిన్సిపాల్‌కు హామీ ఇచ్చారు. చెడు వ్యసనాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు మరింత అవగాహన కల్పించాలని కోరారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కనీసం మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని తల్లిదండ్రులు సూచించారు. విద్యార్థులకు నిరంతరం మోటివేషన్ కల్పించడం ద్వారా వారు చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు, తమ లక్ష్యాల పై దృష్టి సారించే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఉన్నత విద్య, భవిష్యత్తు అవకాశాల పై కూడా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని కోరారు. "మీ పిల్లల చదువును గమనించండి -- వారి భవిష్యత్తును నిర్మించండి" అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునులు మరియు విద్యార్థులు, తల్లిదండ్రులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



# టవర్ ఉన్నా నెట్‌వర్క్ ఏదీ?

నెన్నెలలో జియో సేవలపై వినియోగదారుల ఆగ్రహం



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి)** నెన్నెల మండల కేంద్రంలో జియో నెట్‌వర్క్ సమస్యతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెల రోజులుగా జియో ఇంటర్నెట్ సేవలు సక్రమంగా అందడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 5జీ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటికీ కనీసం 2జీ స్థాయిలో కూడా ఇంటర్నెట్ వేగం ఉండటం లేదని ఆరోపిస్తున్నారు. నెట్‌వర్క్ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. రీచార్జ్ ఒక్కరోజు ఆలస్యమైనా సేవలను నిలిపివేసే సంస్థ, నెలల తరబడి నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. నెట్‌వర్క్ సరిగా లేకపోవడంతో ఆన్‌లైన్ పనులు, విద్యార్థుల చదువులు, ఇతర అవసరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. రీచార్జ్ ధరలు పెంచుతున్నప్పటికీ అందుకు తగిన స్థాయిలో సేవలు అందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో జియో టవర్ ఉన్నప్పటికీ నెట్‌వర్క్ సరిగా పనిచేయకపోవడంతోపాటు ఫోన్ మాట్లాడేటప్పుడు కాల్స్ సైతం డిస్టర్బ్ అవుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత జియో సాంకేతిక సిబ్బంది స్పందించి నెట్‌వర్క్ సమస్యను వెంటనే పరిష్కరించాలని నెన్నెల ప్రజలు కోరుతున్నారు.

## దుబ్బపల్లి పాఠశాలలో ఉచిత యూనిఫాంల పంపిణీ



**నెన్నెల, సెప్టెంబర్ 12 (జనంసాక్షి)** దుబ్బపల్లి ఎంపీపీ పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత యూనిఫాంలను శనివారం విద్యార్థినీ, విద్యార్థులకు పంపిణీ చేశారు. సర్పంచ్ ఎండీ ఇబ్రహీం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత యూనిఫాంలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.కావాలంటే దీనిని ఇంకా కొద్దిగా పెంచి పూర్తి స్థానిక వార్తా కథనంగా కూడా తయారు చేస్తాను.

## డీజే ఆపరేటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 12(జనంసాక్షి):** గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీజే ఆపరేటర్లకు శనివారం పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉత్సవాల్లో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని ఎస్ఐ జె.శ్రీధర్ స్పష్టం చేశారు. అధిక శబ్దంతో ప్రజలు, విద్యార్థులు, వృద్ధులకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కమలం గూటికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మోహన్‌రెడ్డి



నల్లబెల్లి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి ): నల్లబెల్లి మండలం మామిండ్లవీరయ్యపల్లె గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, క్లస్టర్ ఇన్‌చార్జి మామిండ్ల మోహన్‌రెడ్డి ఆ పార్టీని వీడి బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాపరెడ్డి సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు. మోహన్ రెడ్డికి కాషాయం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీకి ప్రజలతో పాటు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తల నుంచి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. మోహన్‌రెడ్డి చేరిక అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నర్సంపేట నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.అనంతరం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, నర్సంపేట నియోజకవర్గంలో రాణా ప్రతాప్‌రెడ్డి చేస్తున్న ప్రజాసేవకు ఆకర్షితులై బీజేపీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చు వెంకటేశ్వర్‌రావు, మండల ఉపాధ్యక్షుడు బత్తిని కుమారస్వామి, ముచ్చింపుల గ్రామ పార్టీ అధ్యక్షుడు ధర్మారం క్రాంతికుమార్, యువమోర్చా నాయకుడు తిమ్మాపురం శివ తదితరులు పాల్గొన్నారు.

## ఆరేపల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ కుర్రె మల్లయ్య యాదవ్



టేకుమట్ల సెప్టెంబర్ 12 జనంసాక్షి టేకుమట్ల మండలంలోని ఆరేపల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డ్ రేషన్ షాప్ డీలర్ వద్దా ప్రభుత్వం నుండి ఉచితంగా వచ్చేసన్నబియ్యం కోసం కొత్తగా ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను టేకుమట్ల మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు ఆరెపల్లి సర్పంచ్ కుర్రె మల్లయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం రేషన్ కార్డ్ దారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న భారతదేశంలోనే ఏకైక ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని ఎల్లప్పుడూ కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆయన తెలియజేశారు రేషన్ కార్డు దారులు హర్షం వ్యక్తం చేసారు ఇట్టి కార్యక్రమంలో ఉప సర్పంచ్ గురిజాల మల్లారావ్ వార్డుమెంబెర్స్ కొడారి. సహేందర్ వంగ వేణు గురిజాల. రాధిక భాషవేనా అనిత ఎండీ . రేష్మ గోపు కవిత డీలర్ సుజాత గ్రామప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీ ఎన్నిక



చెన్నారావుపేట, జూన్ 12 ( జనం సాక్షి): మండలంలోని కోనాపురం గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అన్నెబోయిన సారంగం, ఉపాధ్యక్షులుగా అన్నెబోయిన రాకేష్, కార్యదర్శిగా నూనె చిరంజీవి, డైరెక్టర్లుగా మండల అనిల్, కీసర సాంబశివ, బోనాల భద్రయ్య, మిట్టపల్లి నవీన్, గొర్రె రవి, అన్నెబోయిన శ్రీనులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శనివారం ప్రకటించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- మూడు చెక్కల పల్లిలో వైద్య శిబిరం




నల్లబెల్లి, సెప్టెంబర్ 12 (జనం సాక్షి): ఈ సీజన్లో వచ్చే వ్యాధులు జ్వరాలు పట్ల అప్రమత్తంగా ఉండి, గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన డాక్టర్ల వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రాంచంద్ నాయక్ అన్నారు. శనివారం నల్లబెల్లి మండలంలోని మూడు చెక్కలపల్లి గ్రామంలో నర్సంపేటలోని సాయి శ్రీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది గ్రామస్తులకు వివిధ రకాల రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం జరిగింది. సాయి శ్రీ హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక సర్పంచ్ చపావత్ కవిత దేవ్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామచంద్రనాయక్ డాక్టర్ హైమావతి మాట్లాడుతూ ఈ వర్షాకాలం సీజన్లో గ్రామీణ ప్రాంతాల్లో వచ్చే అనారోగ్య పరిస్థితులను ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి వైద్య సేవలు పొందాలని వారు అన్నారు. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి వ్యాధి తీవ్రం కాకముందు సరైన పరీక్షలు చేయించుకొని వైద్య సేవలు పొందేందుకు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చపావత్ కవిత దేవ నాయక్, వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉత్తమ కళాకారుడు ఎల్లన్నకు సన్మానం




పాలకుర్తి, సెప్టెంబరు 12 (జనంసాక్షి) మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన తెలంగాణ ప్రజా కళాకారుడు గుగ్గిల్ల ఎల్లన్నను శుక్రవారం హైదరా బాద్ లోని రవీంద్రభారతిలో ఘనంగా సన్మానిం చారు. 2026 తెలంగాణ ఉత్తమ ఉద్యమ కళాకారుల అవార్డుల ప్రధానోత్సవం హైదరాబాద్‌లో రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉద్యమ అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎంపీ సముద్రాల రవికుమార్, సినీనటుడు బాబుమోహన్ చేతుల మీదుగా ఘనంగా సన్మానం చేసి అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా ఎల్లన్న మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో కళాకారులుగా తమ వంతు బాధ్యతగా, కళ కళ కోసం కాదని ప్రజల కోసమని అనేక పాటలు ప్రజలను చైతన్యం చేసినట్లు తెలిపారు. తనను ఉత్తమ కళాకారుడుగా ఎంపికకు సహకరించిన టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## చింతకుంటవాడలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 12, (జనంసాక్షి ) చింతకుంటవాడలో 1956లో ఏర్పాటు చేసిన పాత విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తెలిపారు. పాత స్తంభాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో శనివారం వాటిని తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న వినాయక శోభాయాత్రలకు ఎలాంటి ఆటంకం కలగకుండా పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య ఆధ్వర్యంలో, 40వ వార్డు కౌన్సిలర్ అడప విజయలక్ష్మి పోశెట్టి సమన్వయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పనులను పూర్తి చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గండ్రత్ వెంకటరమణ, నాయకులు గండ్రత్ రమేష్, లక్కడి జగన్‌మోహన్, విద్యుత్ శాఖ అధికారులు, వార్డు పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో 'ప్రగతి' విద్యార్థుల ప్రతిభ

**ఉమ్మడి వరంగల్ జట్టుకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక**




పాలకుర్తి, సెప్టెంబర్ 12 (జనంసాక్షి) జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి క్రీడా పోటీలలో పాలకుర్తిలోని ప్రగతి విద్యాలయం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. హోరాహోరీగా సాగిన కబడ్డీ పోటీల్లో పాఠశాల జట్టు విశేష నైపుణ్యాన్ని ప్రదర్శించి రన్నరప్ (ద్వితీయ బహుమతి) సాధించింది.ఈ పోటీలలో అత్యుత్తమ ఆటతీరుతో ఆకట్టుకున్న పాఠశాల విద్యార్థులు జి. కార్తీక్, జి. రామ్‌చరణ్ ఉమ్మడి వరంగల్ జిల్లా (యునైటెడ్ వరంగల్) కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో రాణించి పాఠశాల కీర్తిని చాటిన విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్, వీరమనేని వెంకటేశ్వర రావు,ఉపాధ్యాయ బృందం అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఇదే ప్రతిభను కనబరిచి విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు.

## విజయవంతంగా జాతీయ లోక్ అదాలత్




వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 12 (జనం సాక్షి) జాతీయ లోక్ అదాలత్‌లో వరంగల్ జిల్లా వ్యాప్తంగా - 09 బెంచీలను వరంగల్ జిల్లాలో-06, నర్సంపేట- 03 బెంచీలను ఏర్పాటు జరిగింది. మొత్తం-520 పెండింగ్ కేసులను పరిష్కరించడం జరిగింది. ఇందులో సివిల్ కేసులు-64, యమ్.వి.ఓ.పి. కేసులు-53, (రూ.6,72,17,640/-), అదర్ సివిల్ కేసులు-11, క్రిమినల్ కేసులు-456 మరియు బ్యాంక్ పి.ఎల్.సి. కేసులు-26, బి.ఎస్.ఎన్.ఎల్.పి.యల్.సి.కేసులు- 06, ట్రాఫిక్ ఈ-ఛాలన్ పెట్టి కేసులు- 63,002, సైబర్ క్రైమ్-19 కేసులను పరిష్కరించడం జరిగింది. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా - 12 బెంచీలను హనుమకొండ జిల్లాలో- 11, నర్సంపేట- 01 బెంచీలను ఏర్పాటు జరిగింది. మొత్తం-734 పెండింగ్ కేసులను పరిష్కరించడం జరిగింది. ఇందులో సివిల్ కేసులు-56, యమ్.వి.ఓ.పి. కేసులు- 47 (రూ.61,25,961/-), క్రిమినల్ కేసులు- 678 మరియు బ్యాంక్ పి.ఎల్.సి. కేసులు-41, ఎలక్ట్రిసిటి పి.యల్.సి.కేసులు-17, ట్రాఫిక్ ఈ-ఛాలన్ పెట్టి కేసులు- 36,622, సైబర్ క్రైమ్-18 పరిష్కరించడం జరిగింది.ఈ జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగించడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ న్యాయసేవాధికార సంస్థ ద్వారా వరంగల్, హన్మకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ఇరువురు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పెద్దవంగర ప్రజా ప్రతిభ రిపోర్టర్ చింతల ఐలయ్య బ్రెయిన్ స్ట్రోక్ మృతి



పెద్దవంగర సెప్టెంబర్ 12(జనం సాక్షి ) మండలంలోని గంట్ల కుంట గ్రామానికి చెందిన పెద్దవంగర ప్రజా ప్రతిభ రిపోర్టర్ చింతల ఐలయ్య బ్రెయిన్ స్ట్రోక్ మృతి శనివారం .ఈ విషయం తెలుసుకున్న మండల అధ్యక్షుడు కుమ్మరి రామ్మూర్తి, వారి వెంట తులసి వేణు,బుచ్చన్న రాజు సతీష్,మధు, రత్నాకర్ రెడ్డి, మురళి యాకన్న, మల్లేష్ వారి నివాసానికి వెళ్లి, భౌతికదేహానికి నివాళులర్పించారు. అనంతరం ,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

# యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో

## కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్లు వేయాలి
- ఆనగంటి వెంకటేష్ డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



**ఏటూరునాగారం, సెప్టెంబర్ 12(జనంసాక్షి).** యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్ధత విధానాలతో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతుందని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. భారత ప్రజాతంత యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ములుగు జిల్లా 2వ మహాసభలు ఏటూరునాగారం మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ దేశ యువతకు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా 12 సంవత్సరాలు గడుస్తున్నా కోట్లాది మంది నిరుద్యోగ యువతకు తీవ్ర నిరాశ, అన్యాయం మాత్రమే మిగిల్చిందని, ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ ఉద్యోగ అవకాశాలను తగ్గిస్తుండగా, మరోవైపు నీట్,రైల్వే, బ్యాంకింగ్ వంటి పోటీ పరీక్షల్లో వరుసగా ప్రశ్నపత్రాల లీకులు జరుగుతూ విద్యార్థి, యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లోనే సుమారు పది లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆ పోస్టులన్నింటిని భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేసారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు నిరుద్యోగులందరికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి నోటిఫికేషన్లు వేసి ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఎన్నికల మేనిఫెస్టోలో యూత్ డిక్లరేషన్ని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయిన ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్తో పాటు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. సమగ్రమైన వివరాలతో జాబ్ క్యాలెండర్ను ప్రకటించి ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్లను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వేయాలన్నారు. అదేవిధంగా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించే అంతవరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి 4000 రూపాయలు ఇవ్వాలని,స్వయం ఉపాధి రుణాలపై రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించి లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడం లేదు. దరఖాస్తులకే పరిమితం కాకుండా అర్హులైన నిరుద్యోగ యువత అందరికి రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా స్వయం ఉపాధి రుణాలు అందించాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కఠినమైన చర్యలు తీసుకోవాలని, నిరంతర నిఘా అక్రమ రవాణా కు అడ్డుకట్ట వేసి విద్యార్థి, యువత ప్రాణాలను రక్షించాలని అన్నారు. ములుగు జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కలువల రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అరుణ్, లాజర్, పూనెం కృష్ణబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రత్న ప్రవీణ్, జిల్లా నాయకులు మమత, శ్యామ్, రమేష్, రాఘవేంద్ర, సంతోష్, శివ, ప్రవీణ్, లోకేష్, అశోక్, దినేష్లతో పాటు 100 మంది యువత పాల్గొన్నారు.

# నూతన సీఐ వై సతీష్ను

## టేకుమట్ల ఎస్సై జి అమూల్యను కలిసిన టేకుమట్ల ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా ,మండల నాయకులు




**టేకుమట్ల సెప్టెంబర్ 12 జనంసాక్షి** టేకుమట్ల ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ రేణికుంట్ల సంపత్ మాదిగ ఆధ్వర్యంలో నూతన సీఐ టేకుమట్ల ఎస్సై జి అమూల్యను కలిసి నూతనంగా ఏర్పడిన ఎమ్మార్పీఎస్ టేకుమట్ల మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ ఎంఎస్పి టేకుమట్ల మండల అధ్యక్షులు మాదుగుల వీరయ్య మాదిగలను మండల కమిటీలను పరిచయ కార్యక్రమం చేయడం జరిగింది. తదనంతరం నూతనంగా వచ్చిన సిఐ వై సతీష్ను శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాం రాంచందర్ మాదిగ కన్నూరి సారయ్య మాదిగ అక్కల రాజయ్య మాదిగ, ఎంఎస్పి మండల గౌరవ అధ్యక్షులు అంబాల సారయ్య మాదిగ, ఎంఎస్పి అధికార ప్రతినిధి అక్కల బద్రయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి ఇల్లందుల శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కోశాధికారి మచ్చ పైడి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయంను

## సందర్శించిన పురావస్తు శాఖ అధికారులు



**వెంకటాపూర్(రామప్ప),సెప్టెంబర్12(జనం సాక్షి):-** మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంను శనివారం కన్సర్వేషన్ డైరెక్టర్ శ్రవణ్ కుమార్, సూపరెండెంట్ నిఖిల్ దాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్లు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో ఆలయ కారయనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్ వారిని శాలువాలతో సన్మానించి, ప్రసాదాలను అందజేశారు. ఆలయ చరిత్ర, శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు ఇటీవల పునరుద్దరణ చేసిన సోమసూత్రం, ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. వారి వెంట డీఈ కృష్ణ చైతన్య, సీఏలు మల్లేష్ అజీత్,వంశీ కృష్ణకో ఆర్డినేటర్ కుమారస్వామి,టూరిస్ట్ పోలిసులు,దేవాదాయ, పురావస్తు,టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని

# సెప్టెంబర్ 17న అధికారికంగా నిర్వహించాలి

### బిజెపి గర్మిళ్ల జోన్ అధ్యక్షులు అమీరిశెట్టి రాజ్ కుమార్



**మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 12, జనం సాక్షి** సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి గర్మిళ్ల జోన్ అధ్యక్షులు అమీరిశెట్టి రాజు కుమార్ ఆధ్వర్యంలో మంచిర్యాల ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం వస్తే తెలంగాణకు మాత్రం 1948 సెప్టెంబర్ 17న నిజమైన స్వాతంత్రం లభించింది అన్నారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, హైదరాబాద్ సంస్థానం 13 నెలల పాటు నిజాం పాలనలోనే ఉండిపోయిందని నిజాం భారత్ లో కలవడానికి ఒప్పుకోలేదు అని అన్నారు.నిజాంకు మద్దతుగా ఖాసిం రజ్వీ అనే వ్యక్తి రజాకార్లు అనే ప్రైవేట్ సైన్యాన్ని తయారు చేసి నిజాంకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై దోపిడీలు, హత్యలు, అత్యాచారాలకు పాల్పడి భయభ్రాంతులకు గురిచేసేవారన్నారు. అప్పటి భారత ప్రభుత్వం సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి నేతృత్వంలో ఆపరేషన్ పోలో చర్యను ప్రారంభించి సైన్యం ద్వారా నిజాం పాలన ను అంతమొందించి భారతదేశంలో తెలంగాణను విలీనం చేయడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 17 అనేది ఒక తేదీ కాదని చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేదని, ఎంతోమంది త్యాగాల ఫలితంగా ఈ రోజున తెలంగాణాకు విమోచనం జరిగింది అని అన్నారు. కేంద్రంలోని భాజాపా ప్రభుత్వం ప్రతి సంవత్సరం విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్న కూడా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు విమోచన దినోత్సవం నిర్వహించడం లేదన్నారు. పక్కనున్న కర్ణాటక మరియు మహారాష్ట్రలో కూడా విమోచన దినోత్సవం ఆయా ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించి నిజాం కు వ్యతిరేకంగా అప్పటి తెలంగాణ ప్రజల,మహిళల,రైతుల సాయుధ పోరాటాన్ని ప్రపంచాన్నికి తెలియజేయాలని డిమాండ్ చేశారు . ఈ యొక్క కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్ బోట్ల సత్యం, జిల్లా మీడియా ఇన్చార్జి పల్లి రాకేష్, గర్మిళ్ల జోన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి మేడికొండ శ్రీనివాస్, కర్రె లచ్చన్న, తూటి సరస్వతి, తరుణ్ సింగ్, రాకేష్ రైన్వా, పచ్చ వెంకటేశ్వర్లు, ఓం నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.

# విజయ ఉన్నత పాఠశాలలో

## ఘనంగా ముందస్తు వినాయక చవితి వేడుకలు

### రంగవల్లితో గణేష్ చిత్రం వేసిన విద్యార్థులు



**నిర్మల్ రూరల్, సెప్టెంబర్ 12,(జనంసాక్షి ):** విజయ ఉన్నత పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగులతో అందమైన గణేష్ చిత్రాన్ని రంగవల్లిగా వేసి తమ సృజనాత్మకతను చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, ప్రధానోపాధ్యాయులు సామ మోహన్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి పండుగ విశిష్టతను వివరిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పండుగల ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థులు వేసిన గణేష్ రంగవల్లి అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.